www.republichindustan.in
RNI REG.NO. TELTEL/2021/83468

# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక




సంపుటి: 2 సంచిక: 130 | గురువారం 17-09 - 2026 | ఆదిలాబాద్ | హైదరాబాద్ | ఎడిటర్ : రాఠోడ్ రాజు | పేజీలు : 4 | వెల: రూ.2.00



## సెప్టెంబర్ 17 వేడుకలు కేంద్ర ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి..రాష్ట్ర కార్యక్రమానికి రేవంత్ రెడ్డి

**సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు**
**కేంద్ర విమోచన వేడుకలకు అతిథిగా ఉ పరాష్ట్రపతి రాధాకృష్ణన్**
**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో జెండా ఆవిష్కరణ**
**రాష్ట్రంలో 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహణ**
**సీఎం రేవంత్రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వేడుకలు**



2వ పేజీలో...

## సింగపూర్ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమావేశం

**హైదరాబాద్16:** తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు సింగపూర్ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన ఇంధన ? వాణిజ్య విభాగం ప్రకటించింది. సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ పర్మనెంట్ సెక్రెటరీ ఆగస్టీన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తో సమావేశమైంది. అసెంబ్లీలోని చాంబర్లో జరిగిన ఈ సమావేశంలో పారిశ్రామిక పెట్టుబడులపై చర్చలు జరిగాయి. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న సానుకూల అంశాలను ముఖ్యమంత్రి గారు సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక పరమైన సహకారం అందించాలని కోరారు. పెట్టుబడులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు డిసెంబర్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్లో పాల్గొనాల్సిందిగా ఆగస్టీన్



## లండన్ 'ది షార్డ్' వద్ద సీఎం విజయ్ ఈవెంట్ రద్దు ... తీవ్ర నిరాశలో అభిమానులు

**లండన్ లో ఉన్న విజయ్ ని చూసేందుకు వేచి చూసిన వందలాది మంది అభిమానులు**
**భద్రతా కారణాలతో కార్య క్రమాన్ని రద్దు చేసిన లండన్ మెట్రోపాలిటన్ పోలీసులు**
**ఈరోజు భారత్ కు తిరిగి రానున్న విజయ్**

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ని చూసేందుకు లండన్లోని అత్యంత ఎత్తైన భవనం 'ది షార్ట్' వద్ద నిన్న వంద లాది మంది అభిమానులు భారీగా గమి గూడారు. అయితే, అత్య ధిక జనసం దోహం కారణంగా భద్రతా సమస్యలు తలెత్తే

2వ పేజీలో...

## శరత్చంద్ర రచనలు చదవండి..
## యువతకు ప్రధాని పిలుపు...

**ప్రఖ్యాత బెంగాలీ రచయిత శరత్ చంద్రకు ప్రధాని మోదీ నివాళి**
**150వ జయంతి సందర్భంగా రచయితను స్మరించుకున్న ప్రధాని**

ప్రముఖ బెంగాలీ రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి శరత్చంద్ర ఛటోపాధ్యాయ 150వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు ప్రధాని సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. శరత్ చంద్ర సాహిత్య వైభవాన్ని, సామా జిక సంస్కరణల పట్ల ఆయనకున్న అంకితభావాన్ని స్మరించుకున్నారు. శరత్ చంద్ర రచనలు కేవలం బెంగాలీ భాషకే పరిమితం కాలేదని, దేశంలోని అన్ని ప్రాంతీయ భాషలతో పాటు పలు విదేశీ భాషల్లోకి కూడా అనువాదమయ్యాయని ప్రధాని పేర్కొన్నారు. 19వ శతాబ్దపు భారతదేశాన్ని, ముఖ్యంగా గ్రామీణ బెంగాలీ సామాజిక పరిస్థితులను ఆయన తన రచనల్లో అత్యంత వాస్తవికతతో ఆవిష్కరించారని కొనియాడారు. ఆయన రచనలు సామాజిక సంస్కరణ, మహిళా హక్కులకు అద్దం పట్టాయన్న మోదీ



2వ పేజీలో...




## 8కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించిన

**: మంత్రి పొన్నం ప్రభాకర్**

2వ పేజీలో...

**జననినాదం,కరీంనగర్ 16:** కరీంనగర్ పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా.. వారికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. కరీంనగర్ మార్కెట్యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా




## స్వేచ్ఛ ఊరికే వచ్చింది కాదు

**ఎంపీ ఈటల రాజేందర్.**

2వ పేజీలో...

**హైదరాబాద్ 16:** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా పెరేడ్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్. బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్ర దాచేస్తే దాగేది కాదు. త్యాగాలతో కూడుకున్న తెలంగాణ చరిత్రను భావితరాలకు అందించాలన్నది మన లక్ష్యం. త్యాగం చేసిన వారి గొప్పతనం ప్రతి విద్యార్థి, యువకుని గుండెల్లో ఉండాలని అన్నారు. అందుకే ఆ త్యాగాల చరిత్ర ఎగ్జిబిషన్ ని ఈరోజు పెరేడ్ గ్రౌండ్లో దత్తాత్రేయ చేతుల మీదుగా ఆవిష్కరించుకున్నాము. దేశమంతా మూడు రంగుల మువ్వన్నెల జెండాను ఆగస్టు 15 సెప్టెంబర్ 1947 న ఎగరవేస్తే.. తెలంగాణలో మాత్రం ఆ జెండా కోసం అనేకమంది ప్రాణాలు త్యాగం చేసిన తర్వాత

## మరి హరీశ్ రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'..

**పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు ....అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్పై ప్రశ్నలు**
**పల్లా రాజేశ్వర్ రెడ్డిపై నకిలీ ఎన్ఐసీ ఆరోపణ**
**గంగుల కమలాకర్ భూములపైనా మంత్రి వ్యాఖ్యలు**
**22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములని వెల్లడి**
**47,440 ఎకరాలు తగ్గించినట్లు ప్రభుత్వం వెల్లడి**



**హైదరాబాద్16:** మాజీ మంత్రి హరీశ్ రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తమేనని, అలాంటప్పుడు హరీశ్రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించాది. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ...

మిగతా 2 లో...

## అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్

***ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని సవాల్***
***తనతో పాటు పలువురి ఆస్తులపైనా సీబీఐ విచారణకు డిమాండ్***
***అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి***
***గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ***
***ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య***



**హైదరాబాద్16:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విదారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. ...మిగతా 2 లో...

## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని
## ఆ ఇద్దరూ మళ్లీ అధికారంలోకి తెస్తారు

**రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ మధ్య పూర్తి సమన్వయం ఉందన్న శ్రీధర్ బాబు**
**రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలో కాంగ్రెస్ మళ్లీ గెలుస్తుందని వ్యాఖ్య**
**అసెంబ్లీని సుదీర్ఘంగా నిర్వహించడం బీఆర్ ఎస్ నేతలకు నచ్చదని విమర్శ**

**హైదరాబాద్16:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ల మధ్య అత్యుత్తమ పరిపాలనా, రాజకీయ సమ స్వయం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విజన్, పార్టీ నిర్మాణం ఒకే దిశలో పయని స్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ తెలం గాణలో తిరిగి ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అసెం బ్లీలో చర్చించాలనే తాము భావించామని... అయితే సభకు ముఖం దాటేసే వ్యూహ ంతోనే కావాలని గందరగోళం సృష్టించి వారు సభ నుంచి సస్పెన్షన్కు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు శాసనసభ ప్రజాస్వామ్య నియమావళి, సభ నిర్వహణ అస్సలు నచ్చవని విమర్శించారు. తమ పదేళ్ల పాలనలో అసెంబ్లీని అతి తక్కువ రోజులు నడిపిన చరిత్ర బీఆర్ఎస్ ది, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా సుదీర్ఘంగా సభను నిర్వహిస్తుంటే తట్టుకోలేక పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసుల పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలిచేస్తోందని శ్రీధర్ బాబు దుయ్యబట్టారు.



# సింగపూర్ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమావేశం

మొదటిపేజీ తరువాయి...

లీ ని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సింగపూర్ ప్రతినిధులకు వివరించారు. తొలిదశలో మూసా, ఈసా నదుల సంగమం గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవనం చేపడుతున్నట్టు తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్‌తో పాటు నైట్ ఎకానమీ అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేసినట్టు తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని పర్యాటకంగానే కాకుండా ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీని నెట్-జీరో సిటీగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, ఓఎ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. పెట్టుబడులపై సానుకూలంగా స్పందించిన



సింగపూర్ ప్రతినిధి బృందం.. సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి సానుకూలంగా ఉన్నట్టు ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు , సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్ , సింగపూర్ కాన్సుల్ జనరల్ విలియం చిక్ తో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ ఊరికే వచ్చింది కాదు

మొదటిపేజీ తరువాయి...

17 సెప్టెంబర్ 1948 రోజున ఎగురవేసుకున్నాము. ఈరోజు మనము అనుభవిస్తున్న స్వేచ్ఛ ఊరికే వచ్చింది కాదు. అది కేవలం జెండా మాత్రమే కాదు, లక్షలాదిమంది భరతమాత ముద్దుబిడ్డలు ప్రాణ త్యాగాలు, కోట్లాదిమంది ప్రజల కష్టం. భరతమాత దాస్యశృంఖలాలు తెంచడానికి ఎంతోమంది నేలకొరిగారు. భారతదేశ స్వతంత్ర సంగ్రామంలో కులానికి మతానికి ప్రాంతానికి సంబంధం లేకుండా కొట్లాడారు. - స్వేచ్ఛ స్వతంత్రం కోసం ఉద్యమించారు. విలీనమా, విమోచనమా, విముక్తినా అనే చర్చ లేదు ఇది ముమ్మాటికి విముక్తినే. మనకు స్వేచ్ఛ ప్రసాదించిన రోజు. ఆనాడు వందేమాతరం అంటే జైల్లో పెట్టారు.. మూడు రంగుల జెండాను ఎత్తినందుకు పరకాలలో 26 మందిని చంపారు. ఒక పత్రిక పెట్టే స్వేచ్ఛ లేదు నిజాంకాలంలో. ఖాసిం రజ్వీ మన ఆడపిల్లల మీద చేసిన అఘాయిత్యాలు చెప్పనాలవి కావని అన్నారు. నిజాం




అరాచకాలపై దాశరథి గారి లాంటి వారు పాట రాసినా..యాదిగిరి లాంటివారు పాడినా.. పత్రికలో రాసినా జైల్లో పెట్టారు, హత్య చేసినట్టు చరిత్ర చెబుతుంది. - నిర్మల్ దగ్గర ఒక రాంజీ గోండు నిజాం సైన్యం మీద చేసిన పోరాటానికి 1857 లో వారిని బంధించి ఒకే చెట్టుకు వెయ్యి మందిని ఉరివేశారని అన్నారు.

# రాజీవ్ నగర్ లంబాడి తండా భూ సమస్యలను పరిశీలించిన

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్

**అధికారులతో కలిసి భూముల వివాదానికి సంబంధించిన వివరాల సేకరణ**

**కమాన్ పూర్ 16:** రామగుండం మండలం 8 ఇంక్లైన్ కాలనీలోని రాజీవ్ నగర్ లంబాడి తండాను భారత జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ బుధవారం సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఉన్నతాధికారులతో కలిసి తండాలో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలు, భూములకు సంబంధించిన వివాదాలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ, సింగరేణి 8 ఇంక్లైన్ కాలనీ పరిధిలో కొన్ని కేసులు కమిషన్ దృష్టికి వచ్చాయని, వాటికి సంబంధించి ఇప్పటికే సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆయా కేసులపై మరింత స్పష్టత కోసం నేడు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించామని, రాజీవ్ నగర్ లంబాడి తండాలో ప్రజలు సుమారు 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. ప్రస్తుతం వారు నివాసం ఉంటున్న భూములకు సంబంధించి వివాదం నెలకొన్న నేపథ్యంలో భూముల పరిస్థితి, ప్రజల సమస్యలు, సంబంధిత అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించినట్లు చెప్పారు. సింగరేణి సంస్థకు పెద్ద ఎత్తున భూములు ఉన్నాయని, అవసరం లేకుండా వ్యక్తులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. ఈ భూముల



సమస్యకు సంబంధించి సింగరేణి సంస్థ సీఎండీకి లేఖ రాసి, ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. ఒక ప్రాంతంలో 12 సంవత్సరాలుగా నివాసం ఉంటే హక్కులు పొందే అంశానికి సంబంధించి చట్టపరమైన నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశానికి సంబంధించి భూముల రికార్డులు, హక్కులు, ఇతర చట్టపరమైన అంశాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రాజీవ్ నగర్ లంబాడి తండా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో (అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్) అరుణ శ్రీ జిల్లా, రెవెన్యూ, సింగరేణి,జిల్లా అధికారులు ,తదితర శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

# కోటి ఎకరాలు కాదు.. కేవలం 3.60 లక్షల ఎకరాలే నిషేధిత జాబితాలో ఉన్నాయి

**: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ అసత్యాలు మాట్లాడుతోందన్న ఆది శ్రీనివాస్‌బీఆర్ఎస్ పాలనలోని తప్పిదాలను సరిదిద్దుతుంటే ఓర్వలేకపోతున్నారని మండిపాటుమాక్ అసెంబ్లీ పేరుతో బీఆర్ఎస్ నాటకాలు ఆడుతోందని విమర్శతెలంగాణలో సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ పార్టీ పచ్చి అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'ధరణి' పోర్టల్ ద్వారా కొందరు నేతలు భూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఆనాటి పాలకులు చేసిన చారిత్రక తప్పిదాలను ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో సరిదిద్దుతుంటే ఓర్వలేక నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏకంగా కోటి ఎకరాల భూములను 22ఏ జాబితాలో చేర్చారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వాస్తవానికి హైకోర్టు ఆదేశాలు, తీవ్రమైన న్యాయపరమైన వివాదాలు ఉన్న కేవలం 3.60 లక్షల ఎకరాల భూములను మాత్రమే నిబంధనల ప్రకారం నిషేధిత జాబితాలో ఉంచినట్లు



స్పష్టం చేశారు. అధికారుల తప్పిదం వల్ల ఎక్కడైనా చిన్నపాటి లోపాలు తలెత్తితే వాటిని ప్రభుత్వం వెంటనే సరిదిద్దుతోందని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే సభకు హాజరుకాకుండా 'మాక్ అసెంబ్లీ'ల పేరుతో నాటకాలు ఆడటం బీఆర్ఎస్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సభాపతిని, దళిత వర్గాలను, విధి నిర్వహణలో ఉన్న పోలీసులను అవమానిస్తూ ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో ధరణి అడ్డం పెట్టుకుని జరిగిన భూ దారుణాలను త్వరలోనే ఆధారాలతో సహా అసెంబ్లీ వేదికగా బట్టబయలు చేస్తామని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

# లండన్ 'ది షార్డ్' వద్ద సీఎం విజయ్ ఈవెంట్ రద్దు ... తీవ్ర నిరాశలో అభిమానులు

అవకాశం ఉందని బందన్ మెట్రో పాలిటన్ పోలీసులు హెచ్చరించడంతో ఆ కార్యక్రమాన్ని నిర్వాహకులు రద్దు చేశారు. గంటల తరబడి వరుసల్లో వేచి ఉన్న అభిమా నులకు ఈ నిర్ణయం తీవ్ర నిరాశను మిగిల్చింది."శాంతిభద్రతలు, ప్రజా భద్రత దృష్ట్యా ముందస్తు అనుమతి లభించకపోవడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి బృందానికి చెందిన ప్రతినిధి మైక్ ప్రకటించారు. "తమిళనాడులో చూనే జనసందోహంతో పోలిస్తే ఇది చాలా తక్కువే అయినప్పటికీ, భద్రత పరంగా పోలీసుల నిర్ణయం సహేతుకమైనదే. కానీ గంటల తరబడి హోటల్ బయట వేచి ఉన్న అభిమానులకు నిరాశ తప్పలేదు" అని ఒక యువ అభిమాని పేర్కొన్నారు. మరోవైపు, తమిళనాడును ఆసియాలోనే అధునాతన తయారీ, సాంకేతిక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా విజయ్ నేతృత్వంలోని బృందం బ్రిటన్ పర్యటన చేపట్టింది. ఈ పర్యటనలో భాగంగా రూ.12,300 కోట్ల విలువైన ఒప్పందాలపై సంతకాలు జరిగినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో దాదాపు 9,400 కంటే ఎక్కువ ఉన్నత స్థాయి ఉద్యోగాలు లభించనున్నాయనే అంచనాలు ఉన్నాయి. తన యూకే పర్యటనను ముగించుకుని విజయ్ ఈరోజు భారత్కు చేరుకోనున్నారు.

# 8కోట్లతో భారీ సెంట్రలైజ్డ్‌కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించిన

మొదటిపేజీ తరువాయి...

ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరిశీలించారు. విద్యే పిల్లలకు గొప్ప ఆస్తిఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. గతంలో విద్యార్థుల ఎదుగుదలకు భూములు, నిధులు వంటి ఆస్తులు ఉండేవని, ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు. ఇటీవల జరిగిన సిప్ సర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలించినప్పుడు ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పుడు విద్యార్థులకు ఉదయమే నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆకలితో చదువుకు ఆటంకం ఉండొద్దు:ఆకలితో ఉన్న పిల్లవాడు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడని మంత్రి అన్నారు. విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత, జ్ఞానాత్మక సామర్థ్యం, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల హాజరు, సమయపాలన, విద్యా పనితీరు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఆర్థికంగా, సమయపరంగా ఉపశమనం కల్పిస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కరీంనగర్‌లో 49,025 మందికి అల్పాహారం:కరీంనగర్‌లో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ సేవలు అందుతాయని చెప్పారు. మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందుతారని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని చెప్పారు. రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు. ఇక్కడి నుంచి 17 మండలాల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ జరుగుతుందని చెప్పారు. అధునాతన యంత్రాలతో ఆహార తయారీ:కిచెన్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తయారు చేసే మిషన్లు ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. పాత్రలు శుభ్రం చేసే మిషన్లు, పాల కేంద్రం, ఆహార పదార్థాల టెస్టింగ్ ల్యాబ్, కూరగాయలు కట్ చేసే మిషన్లు, కూరగాయలు కడిగే మిషన్లు, చట్నీ పౌడర్ తయారీ మిషన్లు కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. వాటి పనితీరును స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పిల్లలకు విద్యే గొప్ప ఆస్తి : మంత్రి పొన్నం

**రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
**కరీంనగర్‌లో రూ.8 కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్**
**ప్రారంభం49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం**

**కరీంనగర్16:** పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్యేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు ఆకలితో చదువుకు దూరం కాకుండా పోషకాహార అల్పాహారం అందించడమే లక్ష్యమని తెలిపారు. కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. ఈ కిచెన్ ద్వారా 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 49,025 మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన అల్పాహారం అందించనున్నట్లు మంత్రి తెలిపారు. రోజుకు 50 వేల మందికి అల్పాహారం అందించే సామర్థ్యం కిచెన్‌కు ఉందన్నారు. ఇడ్లీ, దోశ, పూరీ, ఉప్మా, మిల్లెట్ ఇడ్లీ, బోండా వంటి అల్పాహారాలను



వారంలో ఆరు రోజులు అందించడంతో పాటు రోజు విడిచి రోజు పాలు పంపిణీ చేస్తామని చెప్పారు. అధునాతన యంత్రాలు, ఆహార పరీక్షా ల్యాబ్, పరిశుభ్రత ప్రమాణాలతో కిచెన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించి 17.72 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 17 వేడుకలు కేంద్ర ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి .. రాష్ట్ర కార్యక్రమానికి రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. పరేడ్ను సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్రెడ్డి, బండి సంజయ్కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరిం చనున్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లు గా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

# శరత్చంద్ర రచనలు చదవండి.. యువతకు ప్రధాని పిలుపు...

మొదటిపేజీ తరువాయి

నేటికీ ఆయన రచనలు విశేష ఆదరణ పొందడానికి ఇదే ప్రధాన కారణమని వెల్లడించారు. కేవలం రచయితగానే కాకుండా, సామాజిక సంస్కరణలు, మహిళా హక్కులు, జాతీయవాదం పట్ల శరత్ చంద్ర ఛటోపాధ్యాయ ప్రదర్శించిన నిబద్ధత ఎంతో స్ఫూర్తిదాయకమని మోదీ ప్రశంసించారు. భావితరాల యువత ఆయన రచనలను మరింత ఎక్కువగా చదవాలని ఈ సందర్భంగా ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

# బాలికలకు అవగాహన సదస్సు

బేతంచెర్ల16: బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్‌నగర్,జెడ్పీ ఉన్నత పాఠశాలలోనంద్యాల జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలోబాలికలకు అవగాహనసదస్సు నిర్వహించారు. అధికారులు సునీల్, రాజశేఖర్,రజియా,హరిత,బాలల హక్కులు,బాల్యవివాహాల నిరోధం,బాల కార్మిక వ్యవస్థ,1098 సేవలు,సోషల్ మీడియా దుర్వినియోగం,మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైతే భయపడకుండా అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలోఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్,ఉపాధ్యాయులు,విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

R. HINDUSTAN
రిపబ్లిక్ హిందుస్థాన్
తెలుగు దినపత్రిక

# సంప్రదాయ ఆహారంతో ఆరోగ్య రక్షణ

## చిరుధాన్యాలు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ ప్రతినిధి 16:** ఆదివాసీల సంప్రదాయ ఆహార అలవాట్లు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు సమాజ ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో బుధవారం ఆర్‌పీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆదివాసీ ఆహార వైభవం' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి కారణంగా తలెత్తుతున్న అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు సంప్రదాయ ఆహార విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సహజసిద్ధమైన ఆహార ధాన్యాలు, చిరుధాన్యాల వినియోగంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, సేంద్రీయ సాగు, మిల్లెట్ల ఉత్పత్తిని విస్తృతంగా ప్రోత్సహించాలన్నారు. ఆదివాసీల జీవన సంస్కృతి, సంప్రదాయ ఆహారాన్ని పరిచయం చేస్తూ గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న ఆర్‌పీజీ ఫౌండేషన్‌ను అభినందించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను కలెక్టర్ సందర్శించి, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలతో తయారు చేసిన వంటకాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేసి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లల పట్ల ప్రేమతో వ్యవహరించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 16:** ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రేమతో, ఆప్యాయతతో వ్యవహరించాలని కలెక్టర్ కె. హరిత సూచించారు. వారు ఎవరికీ తీసిపోరని, సమాజంలో అందరితో సమానంగా ఎదగడానికి అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష, భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలింకో) సహకారంతో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సహాయ ఉపకరణాల గుర్తింపు, నిర్ధారణ కోసం ఏర్పాటు చేసిన శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చూపు, నడక లేదా ఇతర శారీరక ఇబ్బందులు ఉన్న పిల్లలను తక్కువగా చూడకుండా వారి సామర్థ్యాలను గుర్తించి, ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు ఉన్నప్పటికీ పలువురు వివిధ ఉన్నత రంగాల్లో రాణిస్తున్నారని, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని అన్నారు. అలింకో సంస్థ సహకారంతో విద్యార్థులకు అవసరమైన సహాయ ఉపకరణాలను గుర్తించి అందించేందుకు శిబిరంనిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అందించే ఉపకరణాలను సక్రమంగా వినియోగించుకుని విద్యలోనూ, జీవితంలోనూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్యులు, ఉపాధ్యాయులు, అలింకో సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన



**,కాగజ్ నగర్,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 16:** గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎస్పీ నితికా పంత్, బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. మండపాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వివరాలు, బందోబస్తు పాయింట్లు, సిబ్బంది అప్రమత్తత తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. ప్రతి మండపం వద్ద నిర్వహిస్తున్న పాయింట్ బుక్‌లను తనిఖీ చేసి, విధుల్లో భాగంగా సిబ్బంది నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. గణేష్ మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా, సురక్షితంగా జరిగేలా పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దిన్, టౌన్ సీఐ ప్రేమ్ కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థులకు అభినందన -- నగదు బహుమతులు



కరీంనగర్, సెప్టెంబర్ 16: ఇటీవల వెలువడిన ఎస్ఎస్‌సీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి మెరిట్ సాధించిన జెడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి విద్యార్థులను ఘనంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు సిరిపురం మల్లేశం ఆధ్వర్యంలో మెరిట్ సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమానికి స్థానిక 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత-చంద్రశేఖర్ ఆధ్వర్యం వహించారు. విద్యార్థులు చదువులో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి హెడ్‌మాస్టర్ కన్నం రమేష్, ఉపాధ్యాయ బృందం, స్వర్గం సురేంద్రనాథ్, స్వర్గం మునిందర్ తదితరులు పాల్గొని మెరిట్ సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం అందించడం ద్వారా వారి భవిష్యత్ విజయాలకు బాటలు వేయవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు బడి

**ఎంఈవో సునీల్**

**సోంపెల్లి యూపీఎస్‌లో ప్రీప్రైమరీ తరగతి గది ప్రారంభం**

**సిరికొండ 16:** ప్రభుత్వ బడుల్లోనూ ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా వసతులు కల్పిస్తున్నామని ఎంఈవో సునీల్ అన్నారు. మండలంలోని సోంపెల్లి యూపీఎస్‌లో ఏర్పాటు చేసిన ప్రీప్రైమరీ తరగతి గదిని స్థానిక నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. చిన్నారులను ఆకట్టుకునేలా తరగతి గదిని రంగురంగుల బొమ్మలతో అందంగా ముస్తాబు చేశారు. ఆట వస్తువులు, కుర్చీలు, పుస్తకాలు, బూట్లు తదితర సామగ్రిని ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆటపాటలతో నేర్చుకునేలా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించామని ఎంఈవో తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాకాంత్, హెచ్ఎం సంజీవ్, ఉపసర్పంచ్ విలాస్,



మాజీ సర్పంచ్ సూర్యకాంత్, ఉపాధ్యాయులు సురేష్, నిర్మల్, బీజేపీ అధ్యక్షుడు అమూల్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుడు

**సిర్పూర్(యు) 16:** పండుగంటే పూజలకే పరిమితం కాకుండా.. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా పాములవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వినాయక చవితిని జరుపుకున్నారు. విద్యార్థులు స్వయంగా మట్టి, ఆకులు, ఇతర సహజ పదార్థాలతో గణేశుడి విగ్రహాలను తయారు చేసి, వాటిని అందంగా అలంకరించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జనం చేశారు. 'గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా' అంటూ చిన్నారుల నినాదాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. తమ చేతులతో తయారు చేసిన గణేశుడిని నిమజ్జనం చేస్తుండగా పిల్లల్లో ఆనందంతో పాటు ఆత్మీయత కనిపించింది. మట్టి విగ్రహాల తయారీ ద్వారా ప్రకృతికి హాని కలగకుండా పండుగలు నిర్వహించవచ్చనే సందేశాన్ని విద్యార్థులు చాటారు.



మట్టి విగ్రహాల ప్రాధాన్యత, ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ బాధ్యతపై ఉపాధ్యాయులు వారికి అవగాహన కల్పించారు. పండుగను భక్తితో పాటు బాధ్యతాయుతంగా నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది.

# పేదలకు సీఎంఆర్ఎఫ్ అండ

**మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు**

**జైనూర్ 16:** అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు అన్నారు. బుధవారం జైనూర్‌లో అనారోగ్య బాధితులు మహబూబ్‌ఖాన్, అజీర్‌ఖాన్‌లకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ సాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. ఆర్థిక సాయం మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్‌కు లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో



కాంగ్రెస్ మండల అధ్యక్షులు షేక్ రసీద్, ఆత్రం శంకర్, జిల్లా నాయకులు షేక్ ముఖిద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోయం మారుతి, సర్పంచులు జాలిసావ్, మనోహర్, రాజేందర్, భూపతి, చందు, లక్ష్మణ్, అఫ్రోజ్, అబ్బు, గంగారాం, దత్తు, ముఖుందరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్జీఎఫ్ఐ జోనల్ స్థాయి పోటీలకు డీఏవీ విద్యార్థుల ఎంపిక

**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 16:** ఆసిఫాబాద్ జిల్లాలోని డీఏవీ లక్ష్మీపతి సింఘానియా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎస్జీఎఫ్ఐ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9న ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాలలో నిర్వహించిన ఎస్జీఎఫ్ఐ జిల్లా స్థాయి 14 ఏళ్లలోపు, 17 ఏళ్లలోపు బాల, బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో డీఏవీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించారు. 14 ఏళ్లలోపు బాలికల విభాగంలో వర్షిత సహారే, ఆరాధ్య, నమ్రత, శ్రీష్మ.. 17 ఏళ్లలోపు బాలికల విభాగంలో సింధూర.. 14 ఏళ్లలోపు బాలుర విభాగంలో రోహన్ సరోజ్, పీయూష్, సహర్ష్ జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థుల ఎంపిక విషయాన్ని పాఠశాల ప్రిన్సిపల్ అంబదాస్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు



బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జోనల్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు అభినందించారు. రాబోయే పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# జపాన్ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుడు రంగయ్యకు ఘన సన్మానం

**సిర్పూర్(యు),కెరమెరి సెప్టెంబరు 16:** ప్రభుత్వ తరపున జపాన్ పర్యటనకు వెళ్లి విజయవంతంగా తిరిగి వచ్చిన సావర్‌ఖేడ పాఠశాల ఉపాధ్యాయుడు కదెర్ల రంగయ్యకు గ్రామస్థులు ఘనంగా సన్మానం చేశారు. పర్యటనను ముగించుకుని చేరుకున్న సందర్భంగా గ్రామ సర్పంచ్ కావుడే తులసిరాం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సావర్‌ఖేడ్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రంగయ్య ప్రభుత్వ తరపున జపాన్ పర్యటనకు ఎంపికై వెళ్లి రావడం గ్రామానికి, పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యారంగంలో ఉపాధ్యాయుడు రంగయ్య అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి మార్గదర్శకత్వాన్ని అందిస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారని కొనియాడారు. జపాన్ పర్యటనలో విద్యా విధానం, బోధనా పద్ధతులు, అక్కడి పాఠశాలల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి, వాటిని స్థానిక విద్యార్థులకు ఉపయోగపడేలా అమలు చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయుడు కడియార్ల రంగయ్యను శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం



అందజేశారు. జపాన్ పర్యటన విజయవంతంగా పూర్తిచేసుకుని వచ్చిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ.. తనపై అభిమానంతో సన్మానం చేసిన గ్రామ పెద్దలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యటన ద్వారా పొందిన అనుభవాలను విద్యార్థులకు, పాఠశాల అభివృద్ధికి ఉపయోగపడేలా కృషి చేస్తానన్నారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనక దేవురావు, పంచాయతీ కార్యదర్శి వాజీద్, వార్డు సభ్యుడు అనుముల శంకర్, సెండే చంద్రు, వాడై రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు రంగయ్యకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

R. HINDUSTAN
రిపబ్లిక్ హిందుస్థాన్
తెలుగు దినపత్రిక
RNI REG.NO. TELTEL/2021/83468
గురువారం 17 సెప్టెంబరు 2026


# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 16:** 2026--27 సీజన్‌లో జిల్లాలోని రైతుల నుంచి వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, అధికారులతో కలిసి గ్రామీణ అభివృద్ధి, పౌరసరఫరాల శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 117 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు లోబడి మాత్రమే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన సన్న రకాల ధాన్యానికి మాత్రమే క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఎ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు 2 వేల 461 రూపాయలు, సి గ్రేడ్ ధాన్యానికి 2 వేల 441 రూపాయలుగా ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు, ఆలస్యం కలగకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదరపు గ్రామీణాభివృద్ధి అధికారి, డి.పి.ఎం.లు, పౌర సరఫరాల శాఖ అధికారులు,జిల్లా సమాఖ్య ప్రతినిధులు, ఎ పి ఎం లు, సి సి లు తదితరులు పాల్గొన్నారు.

# టీఎల్‌ఎం మేళాలతో బోధన సులభతరం

## డీఈఓ మాదవి



**సిరికొండ 16:** విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళాలు దోహదపడతాయని డీఈఓ మాదవి అన్నారు. బుధవారం సిరికొండ జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను ఆమె సందర్శించారు. తొలి మెట్టు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు రూపొందించిన బోధనోపకరణాలను పరిశీలించారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బోధనా సామగ్రిని వినియోగించాలని సూచించారు. అనంతరం మేళాలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సునీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ నెల 17న ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 16:** జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఈ నెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రజా పాలన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు అధికారులు, అనధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

# కూరగాయలతో వినాయకుడి ప్రతిమ



**,జన్నారం 16:** మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలకు చెందిన యూకేజీ విద్యార్థిని అజీజా కూరగాయలతో వినాయకుడి ప్రతిమను రూపొందించి ఆకట్టుకుంది. వినాయక చవితి సందర్భంగా అజీజా రూపొందించిన ప్రతిమ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సతీష్ మాట్లాడుతూ చిన్న వయసులోనే అజీజా తన సృజనాత్మక ప్రతిభను చాటడం అభినందనీయమన్నారు. మత సామరస్యాన్ని చాటిన అజీజాను, ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 16:** ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న సివిల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని, పనులలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాభ్యాసం, పాఠశాలలోని సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించడంతో పాటు ఆపార్ నమోదును, బేస్‌లైన్ పరీక్షల నివేదికలను పరిశీలించి, విద్యార్థుల విద్యా పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం వేమనపల్లి మండలం కల్మల్‌పేటలోని యు.పి.ఎస్.ను సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నోటీసులు అందుకున్న స్థానికులతో మాట్లాడి, నోటీసులకు సంబంధించిన వివరాలు, వారి అభ్యంతరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రక్రియపై అవసరమైన సమాచారం అందిస్తూ, అందిన అభ్యంతరాలు, సంబంధిత రికార్డులను నిబంధనల ప్రకారం పరిశీలించాలని అధికారులకు సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో స్థానిక సంస్థల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సమాఖ్య సంఘం భవనాల పనులను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని తెలిపారు. నీటి సంరక్షణ పనులను సమర్థవంతంగా చేపట్టి వర్షపు నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వికసిత్ భారత్ గ్రామీణ పథకం కింద గ్రామాలలో చేపడుతున్న మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామాలలో పారిశుధ్యం, తడి--పొడి చెత్త సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. 16వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో వినియోగించాలని, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలంలోని వీధి దీపాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించే చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజారం గ్రామంలో దశావతార విగ్రహాలను సందర్శించి స్థానికులతో మాట్లాడి విగ్రహాలకు సంబంధించిన చారిత్రక నేపథ్యం, ప్రాధాన్యత గురించి తెలుసుకున్నారు. మండలంలోని పశుసంవర్ధక, పశు జనన నియంత్రణ కేంద్రం లను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారి, ఎస్ఐ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 28 న , సిరిసిల్లలో " ముదిరాజ్ ఆత్మగౌరవ సింహగర్జన "విజయవంతం చేయాలని జిల్లా ముదిరాజ్ సంఘం పిలుపు.




**రాజన్న సిరిసిల్ల 16:** ఈ నెల 28 న , సిరిసిల్లలో ముదిరాజ్ ల ఆత్మగౌరవ సింహగర్జన మహా ధర్నా ను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు చొక్కాల రాము పిలుపునిచ్చారు ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని జిల్లా ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము. బుధవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ముదిరాజు సంఘ నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ ముదిరాజుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఈ నెల 28న సిరిసిల్లలో నిర్వహించనున్న ఆత్మగౌరవ సింహగర్జన మహాధర్నాను ముదిరాజ్ లు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముదిరాజులను ప్రస్తుత బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని, కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో ముదిరాజుల సంఖ్య గణనీయంగా ఉన్నప్పటికీ విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ముదిరాజుల బతుకులు చిరకాల సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించలేదన్నారు. తమ సమస్యలపై ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకురావడానికే సిరిసిల్లలో మహాధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమానికి ప్రతిపక్ష పార్టీల మద్దతు కూడా కోరుతున్నట్లు వెల్లడించారు. ముదిరాజుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వేములవాడలో 5 ఎకరాల స్థలం కేటాయించి ముదిరాజ్ సత్రం ఏర్పాటు చేయాలని, 50 ఏళ్లు నిండిన ముదిరాజులకు పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. ముదిరాజుల చిరకాల వాంఛలను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, డైరెక్టర్ కూనవేణి పరశురాములు, బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరశ హనుమాండ్లు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు వంకాయల కార్తిక్, ప్రతాప్, తిరుపతి, దేవరాజ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు

# మహా గణనాథుడి సేవలో కాంగ్రెస్ నేతలు

## సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా పూజాక్రతువు కిచ్చెన్న



**బాలాపూర్ 16:** బాలాపూర్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీఐపీల దర్శనం జరగాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. నిన్న రాత్రి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ జెడ్పీ ఛైర్ పర్సన్ తీగల అనితారెడ్డి , మాజీ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి సహా పలువురు కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, మార్కెట్ కమిటీ, దేవాలయ కమిటీ సభ్యులు బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వినాయక మండప కమిటీ ఛైర్మన్ నిరంజన్ రెడ్డి సహా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

# హామీలిచ్చి.. అమలులో మోసం

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
## టీ యు సి ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్




**ఆదిలాబాద్ 16:** ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలులో నిర్లక్ష్యం చేస్తోందని టీ యు సి ఐ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ విమర్శించారు. గత నెల 23న రవాణా కార్యాలయం ఎదుట ఆటో కార్మికులతో నిర్వహించిన కార్యక్రమంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమస్యల పరిష్కారానికి రాతపూర్వక హామీ ఇచ్చారని తెలిపారు. అయితే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో వాటిపై ఎలాంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం ఆటో కార్మికులను నిరాశకు గురిచేసిందన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదాయ నష్టానికి పరిహారం అందించాలని, ఆదిలాబాద్‌లో ఆటో కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలకు అనుగుణంగా ఆటో చార్జీలను పెంచాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో ఇంకా జాప్యం చేస్తే టీ యు సి ఐ అనుబంధ తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### సిరిసిల్ల మానేరు తీరంలో నిమజ్జన వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితెరాజన్న



**సిరిసిల్ల 16:** వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలోని ప్రేమ్ నగర్, బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె పలు శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలనువిజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. వినాయక నిమజ్జనానికి కావలసిన నీటి సౌకర్యం, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ అధికారులు సేవలు అందించాలని, పారిశుధ్య పనులు చేయించాలని, క్రేన్లు అందుబాటులో పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రాచారి, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, జిల్లా వైద్యాధికారి ఏంజెలాబ్లైడ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య , తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.